## చట్టం సాహితీ లోకం
95814 19999

### పగిలిన హృదయం.



నీ జ్ఞాపకాలతో...నా
కనురెప్పల మాటున
కమ్మని కలవై కవ్విస్తావు.
ఆ గాఢ నిద్ర  మెలకువలో
కన్నీటి ధారలే పారిస్తావు.
నా కంటి చూపులో నీవుంటే
ఆ కన్నీరైనా ముత్యంలా
కరుగుతుందిలే....
ఒకనాటి మన ప్రేమ
ప్రయాణంలో ఆ...
అనుభూతులు నీ తలపులై
ఆ అనురాగాల వలపులో
నా జన్మజన్మకు గుర్తుచేసే
నీ పిలుపులే...
ప్రేమ సందేశాలు.
నీతోనే మొదలైన నా ప్రేమ
కావ్యం... నేడు దూరమైన
నీ చంద్రబింబం లాంటి
ముఖారవిందం నా...
హృదయాన్ని కబళించింది.
ఆ ఆకాశంలో తారలకై
వేచి ఉన్న చంద్రుడు
దిగులుతో ఉన్నట్టు... నీ
గుబులుతో నిండి ఉన్న
నా హృదయాన్ని.....
నైరాశ్యంలో నెట్టావు.

శ్రీ భార్గవ్ సైదులు,
పెంచికల్ దిన్నె, సూర్యాపేట,
99890238228

చట్టం సాహితీ లోకం
95814 19999

### కొత్త



కొత్త వింత పాత రోత
పాత బంగారం
కొత్త వజ్రం
పాత జ్ఞాపకం
కొత్త ఆధునికం
పాత అనుభవం
కొత్త నవతరం యువతరం
పాత మందకొడి
కొత్త దుడుకు తనం
పాత తుప్పు పడుతుంది మరుగున పడుతుంది
కొత్త నిగారింపునిస్తుంది
పాత ను భద్రం గా దాచి పెడతాం
కొత్త ను మనసులో భద్రం గా దాచుకుంటాం
పాత ను గుర్తుంచుకుంటే
కొత్త ను ఉపయోగించు కుంటాం
పాత ను పక్కన పెడతాం
కొత్త ను మరింత అందంగా కొత్తదనం తో
ఆధునీకరణ తో పటిష్టంగా ఒక కొత్త
సమాజాన్ని నిర్మిద్దాం ...

డి చాంద్ బాషా రచయిత

చట్టం సాహితీ లోకం
95814 19999

### జీవితమే ఒక కావ్యం



మానవ జీవితం మరువలేని మధుర కావ్యం
మూడు అధ్యాయాల సమ్మిళిత కావ్యం
జననం నుండి, మరణం వరకు  రకరకాల
ఊహించని సుఖ, సంతోష, కష్ట, నష్ట సన్నివేశాలతో.

నిండిపోతాయి అన్ని పేజీలు జ్ఞాపకాల అధ్యాయాలుగా
బాల్యం, తెలిసీ, తెలియని సన్నివేశాలతో నిండి
అమ్మా నాన్నల ప్రేమతో, స్నేహితుల సాహచర్యం, ముచ్చట్లతో
బంధు వర్గాల ఆప్యాయత, అనురాగాల వర్షాలతో.

మరువలేని సంఘటనలతో. నిండుతాయి
బాల్య అధ్యాయంలో పేజీలు
యవ్వన అధ్యాయం నిండిపోతుంది చదువు, సంధ్య పేజీలతో
చదువు కొరకు పడిన శ్రమ, కష్టాలతో, చేసిన చిలిపి పనులు, సాగించిన ప్రేమాయణములతో
ప్రేమించిన అమ్మాయితో పెళ్లి, సంసార జంఝాటనతో నిండుతుంది ప్రతి పేజీ .

చివరి మలుపైన వృద్ధాప్య అధ్యాయం పేజీలు
కని పెంచిన పిల్లల వద్ద జీవితంతో, వయసు మీద పడి, నీరసం పెరిగి
అనారోగ్య బాధలతో, ఒంటరి జీవిత సన్నివేశాలతో నిండి పోతాయి పేజీలు
జీవితం దేవుడిచ్చిన వరం, కాకూడదు అది భారం.

అందుకే ప్రతి క్షణం గమ్య స్థానం చేరేందుకు
కష్ట నష్టాలకు ఎదురొడ్డి
ప్రయత్నం చేస్తూ, సమాజం కోసం అనుకున్నది సాధించి, విజయం సాధించి
గర్వంగా చెప్పుకోవాలి.
అదే అవ్వాలి చివరి అధ్యాయంలో, కలకాలం నిలిచేట్టుగా, చివరి అధ్యాయంలో చివరి పేజీగా.

తెలికిచెర్ల రాజ కృష్ణ కామేశ్వర రావు
రిటైర్డ్ సాఫ్ట్వేర్ ఇంజనీర్,
భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ,
ఇస్రో, షార్, శ్రీహరికోట
సూళ్లూరుపేట / తిరుపతి జిల్లా

చట్టం సాహితీ లోకం
95814 19999

### రుద్ర గంగాధరుడు



రజతాద్రి శిఖరాన ధ్యానమగ్నుడవైన
కాలభైరవుడవు నీవే!
ఫాలనేత్రాన అగ్నిజ్వాల దాచిన
ప్రళయ తాండవమూర్తివి నీవే!

దక్షుని యాగము భగ్నమైన వేళ
నీ హుంకారమునకు దిక్కులు కంపించె;
మదనుడు భస్మరాశిగా మారిన క్షణాన
ముల్లోకాలు నీ మూడో కంటి మంటను గాంచె.

అట్టి ఉగ్ర రూపుని శాంతింపజేయ
ఆకాశగంగ నింగి నుండి దిగివచ్చెను;
భగీరథుని దీర్ఘ తపము ఫలియింపజేయ,
సగరపుత్రుల అరువదివేల మందికి ముక్తి నొసగ రాగా...

ఆ దివ్యవేగమును భరించగల శక్తి ఎవ్వరిది?
ఆ ప్రళయ ప్రవాహమును ఆపగల ధీరుడెవ్వడు?
అని చతుర్ముఖుడు చింతించగా,
నీ జటాజూటమును విప్పి నిలిచితివి దేవా!

స్వర్గలోకము నుండి జారిన మందాకిని
నీ శిరస్సుపై మంచు బిందువై వాలెను;
రజతాద్రిని శిరమున దాల్చి,
పుణ్య కాశిన్ పాదములు తడుపుచు సాగెను.

హాలాహలమును మింగి నీలమైన కంఠమున
హిమశీతల గంగను అలంకారముగా దాల్చితివి;
విషమును, అమృతమును సమదృష్టితో జూచు
వైరాగ్య స్వరూపుడవు నీవే కదా శంకరా!

నీ తాండవము సద్దుమణిగిన చోట
గంగ పరవళ్ళు తొక్కి నాట్యమాడెను;
నీ క్రోధాగ్ని చల్లారిన చోట
కరుణామృతము పొంగి పొరలెను.

ఓ గంగాధరా! ఉమాపతీ! మృత్యుంజయా!
నీయందే లయమున్నది, నీయందే సృష్టి ఉన్నది;
నీ జటల యందు ముక్తి ఉన్నది,
నీ పాదధూళి యందు భక్తి ఉన్నది.

రుద్రుడవై దుష్టులను శిక్షించే నీవే,
శివుడవై శరణన్న వారిని రక్షించే నీవే;
గంగను శిరమున దాల్చి జగతికి చాటితివి:
"క్రోధమునకు కరుణయే విరుగుడు" అని.

రచన: ఆనగల్లు మునిరత్నం
పూతలపట్టు, చిత్తూరు జిల్లా
చరవాణి: 9963288544

చట్టం సాహితీ లోకం
95814 19999

### అధికమాసం హరిహరార్చనం



శివశివయన నీచిత్త శాంతియగు
భవుని మహాదేవుని భజియించిన
సర్వసిద్ధి హరి సాయుజ్యము నగు
నమశ్శివాయను నామము పలికిన
మనుజుడు జీవన్ముక్తుం డగునని
సనాత నమ్మిది సిద్ధ మంత్రమిది

అధిక మాసమున దీప దానమున
బాధ శమించును నరకము తొలగును
శివలోకము జను హరిసాయుజ్యము
హరు కభిషేకముతో శుభమ్ములగు
పితృదేవతల నుద్ధరించు నిక

ఘోరనరక బాధల తొలగించును
జితేంద్రియార్చన విశ్వేశ్వరునకు
విజయ పరంపర సందియ మెందుకు
పురుషోత్తమ మాసము శివనామము
అనంతాశ్వ మేధపు ఫలితమ్మిదు

భగవద్గీతా పారాయణము
భగవానుడు హరిస్మరణము
ఘృతాంబరము గుడధాన్యమ్ములు
అన్నదానమతి పుణ్యదాయకము
శాంత్యాధ్యాత్మిక సౌభాగ్యాలు
త్రికరణముల వికాసమాసము


రచన::శంకర్ జీ డబ్బికార్
ఊరు::ఇబ్రాహీంపట్నం రంగారెడ్డి
చరవాణి::9160297956

చట్టం సాహితీ లోకం
95814 19999

### నీ మనస్సు శరీరం విడిచే జాడ్యాలు,,,,

నీలో నీవు ఒంటరివై
నీకై నీవు దివ్యానుభూతిలో
ప్రతి సాయం సంధ్య
రోజువారి బాదరాబంధీలు
జీవితం అగచాట్లు ,వైఫల్యాలు, వికారాలు
కళ్ళు మూసుకుని సుఖాసనంలో
మనస్సు శరీరం తేలికవుతూ
నిగూఢ ధ్యానస్థితిలోకి వెళ్ళి
పొద్దస్తమానం బడలికను గుర్తుచేసుకుని
శరీరంనుండి, మనస్సునుండి
వేదన సంవేదనలు ఒకటొకటిగా
శరీరంనుండి మనస్సునుండి వీడిపోనీయ్
మనస్సు పొరలు విచ్చుకుని
మౌనివై చెడు ఆలోచనలు
చేదు జ్ఞాపకాలను వదిలేయ్
నీ మనస్సు పుటల నిండా
కోరికల సుడిగుండాలను
ఒకటొకటిగా శరీరం మనస్సు
ఒకటిచేసి నీవో శిలలా
నీ వికారాలను ఆత్మ న్యూనతలను
నెమ్మదిగా అతి నెమ్మదిగా
నీనుంచి వదిలిపోయే అజ్ఞాన జాడ్యాలు
నిన్ను క్రుంగదీస్తున్న భావనలు
అవమానాలను అవహేళనలు
సాక్షీభూతంగా గ్రహిస్తూ వదిలేయ్
కోపతాపాల నీలో చెలరేగే మంటలను
వీడిపోతున్న క్షణాలు
అవ్యక్త దివ్యానుభూతిలో
మనస్సులో ఎన్నడూ చూడని ప్రశాంతత
శరీరమంతా ధూళి విడిపోతూ దూదియై తేలికయై
నెమ్మదిగా అతినెమ్మదిగా పూర్వస్థితిలోకి వస్తే
ఆ అవ్యక్తానందం భావనాతీతం వర్ణనాతీతం
ప్రశాంత చిత్తునివై ఆ సాయంత్రం
పడమట అస్తమిస్తున్న ఎర్రని సూరీడుని
అలా తదేకంగా చూస్తూ దివ్యానందంలో
నీ జీవితంలోకి వెలుగుల పరంజ్యోతిని
ఆహ్వానిస్తున్న ఆత్మజ్ఞానం

అపరాజిత్
సూర్యాపేట



చట్టం సాహితీ లోకం
95814 19999

### మాటల మకరందాలు



మాటలు మధురిమలు చిమ్మాలి ---
మల్లెల మకరందమై మనసుల్లో జారాలి,
మరువలేని మమతల మంజీరమై
మానవ హృదయాల్లో మోగాలి॥

మాటలు పరిమళాలు చల్లాలి ---
పారిజాత పవనాలై పలకరించాలి,
పనులభారంతో అలసిన ప్రాణాలకు
పున్నమి చల్లదనమై తాకాలి॥

మాటలు వెలుగులు చిందాలి ---
వెలుతురు వెన్నెలలై వీధుల్ని నింపాలి,
చీకటి చిక్కుల్లో చిక్కుకున్న జీవాలకు
చిగురించే చిరునవ్వుల్ని పంచాలి॥

మాటలు వీనులకు విందునివ్వాలి ---
వీణాగాన స్వరాలై విరియాలి,
వినువీధిలో విహరించే ప్రతి స్వరం
వెన్నెల పాటగా మారాలి॥

మాటలు హృదయాలను కదిలించాలి ---
హిమానీనదాలనైనా హత్తుకునే వేడిమై,
కఠిన మనసుల గోడలకైనా
కరుణా జలధారలై చేరాలి॥

మాటలు గుండెలను గుభాళింపజేయాలి ---
గర్జించే గంగలా గంభీరమై,
నిరాశ నిశ్శబ్దాలను ఛేదించి
నూతన జీవనగీతాలు పాడాలి॥

మాటలు మనసులను మురిపించాలి ---
ముద్దుబాలల నవ్వుల్లా మెరవాలి,
మురిసే మల్లెతీగల ఊయలై
మానవత్వాన్ని మైమరపింప చేయాలి॥


మాటలు కరుణామృతాలై కదగాలి ---
కత్తులై గాయపరచకూడదు,
కలహాల కడలిని దాటించే
కల్పవృక్ష ఛాయలై నిలవాలి॥

మాటలు మనుషులను మేల్కొలపాలి ---
మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలి,
మంచి ముత్యాలు చల్లి
మమతానురాగాలు రేకెత్తించాలి॥

మాటలు మణిమాణిక్యాలు కావాలి ---
మానవతా మంజీరాలై మోగాలి,
మనసుల మందిరాల్లో
మంగళదీపాలై వెలగాలి॥

గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,
భాగ్యనగరం.

-----------



చట్టం సాహితీ లోకం
95814 19999

### సృజనాత్మకత...!





విభిన్నంగా ఆలోచిస్తూ
ఆలోచనలకు పదును పెడుతూ
ఆచరణలో పాటిస్తూ
అవకాశాలు అందుకుంటూ
ప్రపంచ మేలుకై
జీవన మేరుగుదలకై
వినూత్నంగా పనిచేయాలి
పరిస్కారాలు సాధించాలి.
సవాలును ఎదుర్కోవాలి
ప్రత్యేకత చూపాలి.
ప్రతి ఉపాయము
ఆచరణాత్మకంగా
వివరణాత్మకంగా ఉండాలి
ప్రశ్నించే తత్వము
నిరంతర ఫలితము సాధించాలి.
కొత్త కోణంలో
విజ్ఞానమును అందించాలి
అర్థవంతమైన జ్ఞానాన్ని
అనూహ్యమైన విజయాన్ని
నూతన ఆవిష్కరణను పొందాలి
జనులకు మేలు చెయ్యాలి.

డా.యణమనగండ్ల రాజేందర్
వికాస వేదిక కార్యదర్శి ఇల్లందు, భద్రాద్రి కొత్తగూడెం.

చట్టం సాహితీ లోకం
95814 19999

### నిశ్శబ్ద-శబ్ధ తరంగాలు



భీతి గొలిపేలా పరుచుకొన్న
గాఢ నిశ్శబ్దం.. చీమ చిటుక్కుమన్నా
అణుబాంబు విస్ఫోటనమంత శబ్దం..

'ఆమె ' కు అంతటి శ్మశాన నిశ్శబ్దం లోనూ
అన్నీ..శబ్ద తరంగాలు గా
వినిపిస్తూనే ఉన్నాయి..అవధులు
దాటిన ఆనందాల కోలాహలాలు

అంతెరుగని దుఃఖిత విషాదాలు
రుధిర ధారలు రాల్చిన ఘటనలు
అమృత బింధువులు కురిసిన వేళలు
రాతి యుగపు రాళ్ల పగుళ్ల శబ్దాలు

మధ్య యుగపు ఇనుప కత్తుల కరకరలు
సంధి కాలపు తుపాకుల పేలుళ్లు
ఆధునిక ప్రపంచ యుద్ధపు భీకర మోతలు

జల ప్రవాహ తరంగిణులు
జన నివాస రణగొణ ధ్వనులు
ఎడారి ఇసుక గాలుల ఘోషలు
మేఘ మాలికల గుసగుసలు
వర్షపు చినుకుల టపటపలు

విరుల పరిమళపు సువాసనలు
మాడ్చే ఎండల పెళపెళలు
గూటి గువ్వల కువకువలు

కార్చిచ్చుల కణకణలు..
సర్వం..నిశ్శబ్ద.. శబ్ద తరంగాలై
' ఆమె ' చెవిని సోకుతునే ఉన్నాయి.
'ఆమె '..సర్వ సృష్టి జనని 'అవని ' కనుక..!

విజయకుమార్ గడియా
బెంగుళూరు.

